క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం

పిట్టువారిపాలెం(కర్లపాలెం): వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎ.అశ్వినీ రెడ్డి ఇటీవల బదిలీ అయిన పిట్టువారిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులను గురువారం పాఠశాలలో సన్మానించారు. ఉపాధ్యాయులు షంషుద్దీన్, రాజేంద్ర ప్రసాద్, శివజ్యోతిలను అశ్వినీరెడ్డి దంపతులు సత్కరించారు. పాఠశాల హెచ్ఎం పి.నరసింహారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ నాంచారమ్మ, ఉపాధ్యాయులు చంటిబాబు, లక్ష్మయ్య, అర్జునరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రతి రోజు నీటి సరఫరా

బాపట్ల: బాపట్ల పట్టణంలో శుక్రవారం నుంచి ప్రతి రోజు నీటి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకున్నామని మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీటి నిల్వలు తగ్గిపోవటంతో పక్షం రోజులుగా రోజుమార్చి రోజు నీటిసరఫరా చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు నీటి సరఫరా జరుగుతుండటంతో ప్రతి రోజు నీటి సరఫరా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. నీటి పంపింగ్ వ్యవహారాలను డీఈ శ్రీనివాసరావు పూర్తిగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

రెడ్‌క్రాస్ సేవలు ఎనలేనివి



రేపల్లె రూరల్: రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు ఎనలేనివని బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన 10 కేవీ సోలార్ సిస్టమ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. కాకినాడ రెడ్ క్రాస్ బ్రాంచ్ అధ్యక్షుడు రామారావు సహకారంతో కాకినాడ పోర్ట్ ప్రతినిధి మురళీధర్ ప్లాంటును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, కాకినాడ రెడ్ క్రాస్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ చైర్మన్ రామారావు, రాష్ట్ర కో–ఆర్డినేటర్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ, తెనాలి బ్రాంచ్ చైర్మన్ భానుమతి, బాపట్ల జిల్లా చైర్మన్ నారాయణ బట్టు, గుంటూరు జిల్లా చైర్మన్ రామచంద్రరాజు, నిజాంపట్నం బ్రాంచ్ చైర్మన్ కాశెపల్లి గౌరీ శంకర్, రేపల్లె రెడ్ క్రాస్ బ్రాంచ్ కమిటీ సభ్యులు మోపిదేవి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



బాపట్ల అర్బన్: బాపట్ల డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం యూనియన్ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి) పోతిరెడ్డి నాగార్జునరెడ్డిని గురువారం కలిశారు. సెర్ప్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. స్పందించిన పోతిరెడ్డి నాగార్జున ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రెసిడెంట్ థామస్‌బాబు, సెక్రటరీ రాజారావు, తదితరులు ఉన్నారు.

నేడు ఎస్వీఆర్ఎంలో మెగా జాబ్‌మేళా

నగరం: స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ చెప్పారు. గురువారం విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఏపీ ఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి నుంచి ఎంబీఏ వరకు చదివిన, 18 నుంచి 35 ఏళ్లలోపు నిరుద్యోగులు జాబ్ మేళాకు హాజరు కావొచ్చని తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాను ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. తీరప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో డాక్టర్ జి.హనుమంతరావు, ఏపీ ఎస్ఎస్‌డీసీ ప్రతినిధులు సీహెచ్ రవికుమార్, అనేష్‌బాబు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

యాజలి(కర్లపాలెం): వరిగడ్డి వామి దగ్ధమైన ఘటన యాజలి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల మేరకు గ్రామానికి చెందిన ఇక్కుర్తి రవీంద్ర పది ఎకరాల వరిగడ్డి వామి మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు ఎగసి పడి, పూర్తిగా దగ్ధమైంది. ఆస్తి నష్టం సుమారుగా రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్ఐ సాంబశివరావు తెలిపారు.

దిశ యాప్‌పై స్పెషల్ డ్రైవ్

కర్లపాలెం: దిశ యాప్ ఫోన్‌లో ఉంటే రక్షణ వెన్నంటి ఉన్నట్టేనని చందోలు ఎస్ఐ రాజశేఖర్, కర్లపాలెం ఎస్ఐ శివయ్య తెలిపారు. బాపట్ల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కర్లపాలెం, చందోలు పోలీసులు గురువారం దిశ యాప్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవటం వల్ల ప్రమాద సమయంలో సహాయం కోసం ఉపయోగపడుతుందని తెలిపారు. పోలీసులు, మహిళా పోలీసులు కలసి కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలోని పలుచోట్ల స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రయాణికుల మొబైల్ ఫోన్‌లకు దిశయాప్ డౌన్‌లోడ్ చేశారు.

విద్యా రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- 'జగనన్న ఆణిముత్యాలు' ను సత్కరించిన మంత్రి మేరుగ నాగార్జున
- దివ్యాంగులతో కలిసి జన్మదిన వేడుకలు



పదవ తరగతిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి నాగార్జున

వేమూరు: 'జగనన్న ఆణిముత్యాలు' ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించి, బహుమతులు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. ఈ మేరకు వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియంను ప్రభుత్వం ప్రవేశపెడితే.. ప్రతిపక్ష పార్టీ నాయకులు పేద విద్యార్థులకు ఇంగ్లీషు మీడియం అందకుండా ఉండేందుకు.. కోర్టులు ద్వారా అడ్డుకున్నారని మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్ పోరాటం చేసి, నేడు ఇంగ్లీష్‌లో ప్రతి విద్యార్థి మాట్లాడేలా కృషి చేశారని చెప్పారు. విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలను, పథకాలను ఆయన వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత శిఖరాల చేరుతారని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు డి.ధన లక్ష్మి, సోమరౌతు హేమ మణికంఠ, బడుగు జశ్వంత్‌కుమార్, ఎం.జోయి సాత్విక్, కె.జాన్ బాబు, వై.నయోమి, ఇ.సువర్చనకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం దివ్యాంగులు, విద్యార్థులతో కలిసి మంత్రి మేరుగ నాగార్జున జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గం ప్రత్యేకాధికారి బొంత అర్జునరావు, హౌసింగ్ పీడీ ప్రసాద్, ఎంపీపీ యల్లమాటి మోహనరావు, సర్పంచ్ సజ్జా లక్ష్మి, తిరుతమ్మ, శ్రీనివాస్, డి.వెంకట లలితా కుమారి, జెడ్పీటీసీ ఉదయ్ భాస్కర్, చొప్పర సుబ్బారావు, గాజులు భాను ప్రకాశ్, బొల్లిముంత ఏడుకొండలు, దాది సుబ్బారావు, దున్నా మేరీసు బాబు, కోగంటి లవకుమార్, మండల విద్యాశాఖ అధికారి కాజా లక్ష్మీనారాయణ, హెచ్ఎం నాగ లక్ష్మీ పాల్గొన్నారు.

భట్టిప్రోలు: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాట వేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి



బహుమతులు అందజేస్తున్న బాపుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు

డాక్టర్ మేరుగ నాగార్జున తెలిపారు. భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో గురువారం జగనన్న విద్యా కానుక కిట్లు, గత విద్యా సంవత్సరం పదవ తరగతిలో హైస్కూల్‌లో టాపర్లుగా నిలిచిన గుంజా మోహన సుప్రియ, పప్పల సత్యప్రతిష్ఠ, జె.ప్రవల్లికలకు జగనన్న ఆణిముత్యాలు పథకం కింద మెమెంటోలు బహుకరించి శాలువాలతో సన్మానించారు. అనంతరం నిర్వహించిన సరస్వతీ పూజలో పాల్గొన్నారు. సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, ఉప సర్పంచ్ బూర్లె రామ ప్రసాద్, బాపట్ల జిల్లా దేవదాయ శాఖాధికారి పానకాలరావు, ఇన్‌స్పెక్టర్ కుమార్‌బాబు, ఎంఈఓ పులి లాజర్, దేవదాయశాఖ కార్యనిర్వాహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, హైస్కూల్ కరస్పాండెంట్ పులికొండ మల్లిఖార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్షరం విలువ తెలిసిన సీఎం వైఎస్ జగన్

రేపల్లె: అక్షరం విలువ తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని శ్రీ గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అత్యధిక మార్కులతో ప్రతిభకనపరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆణిముత్యాలు పేరుతో అవార్డులు ప్రకటించటం హర్షణీయమన్నారు. విద్యార్థులు జక్కా యశ్వంత్‌కుమార్, పాటి వైష్ణవి, కొలగాని రుత్వికకు ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.15వేలు, రూ.10వేలు నగదు బహుమతులు అందజేశారు. చందు చరణ్‌కుమార్‌కు తృతీయ బహుమతి రూ.5వేలు ఇచ్చారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు త్రినాథ్ నాయక్, కె.అనిల్, పి.లీలాసాయి, లక్ష్మీకుమారి, గంటికోట నాగపావనీలకు మెమొంటోలు అందజేశారు. ఆర్డీవో జగన్నాథం పార్థసారథి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త, తహసీల్దారు మల్లికార్జునరావు, రేపల్లె, నగరం ఎంఈవోలు నవీన్‌కుమార్, హరిబాబు, ఆయా పాఠశాలలో హెచ్ఎంలు పాల్గొన్నారు.

ఆందోళనను జయప్రదం చేయండి

భట్టిప్రోలు: చేనేత కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 19న తలపెట్టిన ఆందోళనలో చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని చేనేత కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు.. రేపల్లె తాలూకా పరిధిలోని భట్టిప్రోలు, ఐలవరం, కనగాల, చెరుకుపల్లి, రాజోలు, ఇసుకపల్లి, పేటేరు, రేపల్లె ప్రాంతాల్లోని సొసైటీ ప్రతినిధులు, మాస్టర్ వీవర్లు, చేనేత కార్మికులను కలసి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీనీ రద్దు, నిల్వ ఉన్న వస్త్రాలను కొనుగోలు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కమిటీ రాష్ట్ర కో– కన్వీనర్ పిల్లలమర్రి నాగేశ్వరరావు, నాయ



భట్టిప్రోలులో కరపత్రాలు అందజేస్తున్న మాస్టర్ వీవర్ భాస్కరరావు

కులు కూరపాటి కోటేశ్వరరావు, రామనాథం పరమేశ్వరరావు, మురుగుడు సత్యనారాయణ, గొట్టుముక్కల బాలాజీ, దొంతు శ్రీనివాసరావు, దీపాల సత్యనారాయణ, కొన్నిపాటి మోహన్‌రావు పాల్గొన్నారు

వేతనాలు వెంటనే విడుదల చేయాలి

వేమూరు: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధుల్లో 33 శాతం కోత పెట్టిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి.అగస్టీన్ అన్నారు. వేమూరులో ఉపాధి హామీ పథకం కూలీలను ఆయన గురువారం కలిశారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కూలీలకు 14 రోజుల వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కూలీలకు వేతనాలు చెల్లించలేక పోతున్నారు. ఈ కార్యక్రమంలో కూలీలు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు, పలకలు పంపిణీ

కోళ్లపాలెం(భట్టిప్రోలు): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ చిత్రాల ఓబేద్ ఆకాంక్షించారు. పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని కోళ్లపాలెంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున జన్మదినోత్సవం సందర్భంగా గురువారం గ్రామానికి చెందిన నీలా నాగరాజు నోట్ పుస్తకాలు, పలకలను 50 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓబేద్ మాట్లాడుతూ మంత్రి నాగార్జున నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ..సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. నూరేపల్లి పీఎసీఎస్ చైర్‌పర్సన్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 11 మంది ఎంపిక

తెనాలిఅర్బన్: స్థానిక ఎన్ఆర్‌కే అండ్ కేఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళాశాలలో టీఎంఐ గ్రూప్ సహకారంతో యాక్సిస్ బ్యాంక్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు బుధ, గురువారాలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. బీకాం, బీఎస్సీ, బీబీఏ విద్యార్థులు 11మంది ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ విజయకృష్ణ తెలిపారు. వారిని అభినందించారు.

సమస్యలు సకాలంలో పరిష్కరించాలి

కోమలి(పిట్టలవానిపాలెం): ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని పిట్టలవానిపాలెం ఎంపీడీఓ మారుతీ శేషమాంబ కోరారు. కోమలి గ్రామ సచివాలయాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీలు పరిష్కరించేందుకు ప్రాధాన్యమివ్వాలని సిబ్బందికి తెలిపారు. సర్పంచ్ శ్యామలా నాగిరెడ్డి, ఈఓపీఆర్డీ పద్మజ, కార్యదర్శి సుజాత, సచివాలయం సిబ్బంది ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ మారుతీ శేషమాంబ

క్రికెట్ టోర్నీ విజేత మార్పు చెన్నాయ్‌వారిపాలెం జట్టు

నర్రావారిపాలెం(కర్లపాలెం): క్రీడాకారులు పోరాట పటిమ కలిగి ఉంటారని వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల యువజన విభాగం అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎస్సీ సెల్ నాయకుడు మార్పు బెనర్జి అన్నారు. నర్రావారిపాలెంలో జరుగుతున్న కోన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. మార్పు చెన్నాయ్‌వారిపాలెం జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా నర్రావారిపాలెం, తృతీయ స్థానంలో దాస్‌నగర్ టీమ్ నిలిచాయి. విజేతకు మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గుండ్రెడ్డి శివ రూ.15వేలు, ద్వితీయ బహుమతి యల్లావుల ఏడుకొండలు రూ.10వేలు, తృతీయ బహుమతి మార్పు బెనర్జి రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటసుబ్బారావు, నర్రా గోపి, మరకా రాజు, మల్లారపు గోపి, నాగరాజు, దుర్గారెడ్డి, మణికంఠరెడ్డి, రాజేష్‌రెడ్డి ఉన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఏడుకొండలు, బెనర్జి

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

బాపట్ల అర్బన్: బాపట్ల నియోజకవర్గంలోని వైఎస్సార్ క్రాంతి పథం పొదుపు సంఘాల మహిళలకు, కో–ఆర్డినేటర్లకు 2023–24 వార్షిక ప్రణాళికపై గురు వారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సమావేశం జరిగింది. ఏరియా కో–ఆర్డినేటర్ సుబ్బారావు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులందరూ వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నింటినీ మహిళలకు లబ్ధి చేకూరేలా చేయాలని కోరారు. పలు పథకాల ద్వారా 25 శాతం సబ్సిడీతో రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ రుణాలను వినియోగించుకునేలా లబ్ధిదాలను ఎంపిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ లింకేజి డీపీఎం కన్వీనర్ ఎ. లక్ష్మణాచారీ, ఇండస్ట్రీస్ ఏడీ సూరి బాబు, హార్టికల్చర్ ఏడీ ఓనమ్మ, డీఆర్‌డీఏ హెడ్ క్వార్టర్ సిబ్బంది, డీపీఎం ప్రమీల. సీపీఎం రామకృష్ణన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏరియా కో–ఆర్డినేటర్ సుబ్బారావు

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో శివనాగేశ్వరరావుకు చోటు

తెనాలి: తెనాలికి చెందిన ప్రవాస భారతీయుడు, కువైట్‌లోని చిత్రకళా ఉపాధ్యాయుడు అవనిగడ్డ శివనాగేశ్వరరావు ఓ అరుదైన రికార్డును సాధించారు. కువైట్‌లోని అహ్మదీలోని పహాహీల్ అల్ వతనీహ్ ఇండియన్ ప్రైవేటు స్కూల్ (ఢిల్లీ పబ్లిక్ స్కూల్)లో ఫైన్ ఆర్ట్స్ డిపార్టుమెంట్ అధిపతిగా చేస్తున్న శివనాగేశ్వరరావు, తన 58 మంది విద్యార్థులతో కలిసి మైక్రోగ్రఫీలో యూకేకు చెందిన 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సాధించారు. వివిధ దేశాలు, పాఠశాలలు, వయసు సమూహాలకు చెందిన 58 మంది 2–12 తరగతుల విద్యార్థులు గత మే నెల 6వ మైక్రోగ్రఫీ ద్వారా కువైట్ జెండా, టవర్లు, లిబరేషన్ టవర్ చిత్రాలను రూపొందించిన సామూహిక ఈవెంట్‌కు ఈ రికార్డు లభించింది. స్కెచ్ పెన్నులు, బాల్‌పాయింట్ పెన్, హెచ్‌బీ పెన్సిల్‌తో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ చిత్రకళ కొనసాగింది. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించటంతో ఈ నెల 7న శివనాగేశ్వరరావు, అతడి 58 మంది విద్యార్థులను సత్కరించారు.

అంగన్‌వాడీలకు పిల్లలను పంపించండి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



జువ్వలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రదర్శన

చెరుకుపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని చెరుకుపల్లి సెక్టారు సూపర్‌వైజర్ డి.ధనలక్ష్మి సూచించారు. గుళ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాల స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జన భాగీదారి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇళ్లల్లో నిరుపయోగ వస్తువులతో తల్లులు తయారు చేసిన బొమ్మలను ప్రదర్శించారు. సూపర్‌వైజర్ ధనలక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులు మూడేళ్లు నిండిన తమ పిల్లలను అంగన్ వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీల్లో చిన్నారులకు సృజనాత్మకతతో కూడిన విద్య అందిస్తారని చెప్పారు. గుళ్లపల్లి ఎంపీపీఎస్ పాఠశాల హెచ్ఎం అహ్మద్, ఏఎన్ఎం సరిత, జీఎంకేఎస్ దివ్య, అంగన్ వాడీ కార్యకర్తలు శిరీష, నాగరాజ కుమారి, సుధాలక్ష్మి, పద్మావతి, సక్కుభాయి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తుకు పునాది..

కొల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడుతాయని దోనేపూడి సెక్టార్ సూపర్‌వైజర్ నాగరాజకుమారి అన్నారు. గురువారం జువ్వలపాలెం, దోనేపూడి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జన భాగీదారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు వయస్సుకు తగిన రీతిలో పౌష్టికాహారాన్ని అందజేయడం జరుగుతుందని తెలిపారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యా బోధన అందించి, వారి జ్ఞాపక శక్తి మెరుగుపడటానికి అవకాశం ఉంటుందని వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించిన ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: ప్రభుత్వ ప్రోత్సాహంతో విద్యార్థులు ఉన్న శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ హైస్కూలులో జగనన్న ఆణిముత్యాలు పథకంలో భాగంగా గత విద్యా సంవత్సరం పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన గురువారం ఘనంగా సత్కరించారు. పదో తరగతిలో నలుగురు, ఇంటర్మీడియట్‌లో నలుగురు మొత్తం ఎనిమిది మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, మొమెంటోలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద విద్యార్థులు విద్యతోనే ఉన్నత స్థితికి చేరుకునే అవకాశం ఉందని తెలిపారు. నగదు చెక్కులు అందజేశారు. డీఈఓ రామారావు, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, ఎంఈఓ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ తాగునీరందిస్తాం

పేరలి(కర్లపాలెం): గ్రామంలోని ప్రజలందరికీ తాగునీరు అందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. పేరలి గ్రామంలో తాగునీటి అవసరాల కోసం గ్రామ పంచాయతీ నిధులు రూ.1.50 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను ఎమ్మెల్యే కోన రఘుపతి గురువారం ప్రారంభించారు. తాగునీటి కాలువలలో నీరు లేకపోవటంతో బోర్లు వేసి విద్యుత్ మోటార్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ఇప్పటికే పైప్ లైన్ల నిర్మాణం పూర్తి కావచ్చిందని తెలిపారు. గ్రామ సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు, మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు, ఎంపీటీసీ కాగిత బుల్లియ్య, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు మీరయ్య, ధర్మేంద్ర, అర్జున్‌రెడ్డి, బాలాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భాగ్యరాజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సోమిరెడ్డి పాల్గొన్నారు.

కావూరమ్మ ఆలయానికి ఎంపీ రూ.50వేలు విరాళం

చెరుకుపల్లి: గ్రామ దేవతలను పూజించుకోవటం వల్ల ఆయా గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని వైఎస్సార్ సీపీ ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. తుమ్మలపాలెం పంచాయతీ జొన్నలగడ్డవారి పాలెంలో ఇటీవల ప్రతిష్ఠించిన శ్రీ కావూరమ్మ అమ్మవారి దేవస్థానం 16 రోజుల పండుగ నిర్వహించారు. గురువారం ఎంపీ మోపిదేవి ఆలయాన్ని సందర్శించి కావూరమ్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు ఆయన రూ.50వేలు విరాళం అందించారు. కమిటీ పెద్దలు మోపిదేవిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చీరాల చెంచుదేవి, శివరామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ పైనం ఏడుకొండలురెడ్డి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామినేని కోటేశ్వరరావు, చెన్ను కోటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న ఎంపీ మోపిదేవి

శ్రీవాసవి ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నిక

బాపట్ల: శ్రీవాసవి ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. వెదుళ్లపల్లి, బేతపూడి సంఘానికి నూతన అధ్యక్షులుగా చంద్రపాటి వెంకట రామోహన్‌రావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే కోన రఘుపతి నూతన కమిటీని అభినందించారు. సంఘం కార్యదర్శిగా బైసాని అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కాలేపల్లి సత్యనారాయణ, ట్రెజరర్‌గా చీదెళ్ల సుభాష్ చంద్రబోస్‌ను ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మిశెట్టి రత్నగుప్తా, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, నాయకులు నాగవరపు కృష్ణ, నక్క స్వామిరెడ్డి తదితరులు ఉన్నారు.



నూతన కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జనార్దనరావు

తెనాలిరూరల్: మన్యం జిల్లాలో గంజాయి కొనుగోలు చేసి తెనాలి పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్న ఇద్దరు నిందితుల్ని తెనాలి రూరల్ పోలీసులు వల పని పట్టుకున్నారు. తెనాలి మండలం సంగం జాగర్లమూడికి చెందిన అబ్దుల్ రషీద్, పెదరావూరు గ్రామానికి చెందిన కోటంరాజు కామేశ్వరరావు నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెనాలి డీఎస్పీ జనార్దన్ రావు తెలిపారు. గురువారం సాయంత్రం తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెల్లడించారు. సంగం జాగర్లమూడి గ్రామానికి చెందిన అబ్దుల్ రషీద్ గతంలోనూ బైక్ దొంగతనాలు, నివాస గృహాల్లో చోరీలకు పాల్పడడం, గంజాయి విక్రయ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ప్రస్తుతం అవన్నీ కోర్టుల్లో విచారణలో ఉన్నట్లు తెలిపారు. మన్యం జిల్లా జీకే వీధిలో బైక్‌పై గంజాయిని కొనుగోలు చేసే రషీద్ కిలో గంజాయిని రూ.3000కు కొనుగోలు చేసి, తెనాలి పరిసర ప్రాంతాల్లో రూ.15 నుంచి రూ. 20 వేలకు ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఇతని వద్ద పెదరావూరుకు చెందిన కోటమరాజు కామేశ్వరరావు గంజాయి కొనుగోలు చేసి కొంత తాను వినియోగించుకుంటూ మరికొంత బయటి వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు ద్వారా నిర్ధారణ అయిందని డీఎస్పీ వివరించారు. నిందితుడు రషీద్ సంగం జాగర్లమూడి లాకులు వద్ద గంజాయి విక్రయిస్తుండగా తెనాలి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని, అతని నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. రూరల్ సీఐ కె. శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

వైఎస్సార్ పశు బీమా లాభాలివీ..

రేపల్లె రూరల్: పశు పోషకులకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ పశు బీమా పథకం ద్వారా చేయూతనందిస్తోందని తుమ్మల పశు వైద్యాధికారి ఎ.ప్రవీణ్ కుమార్ తెలిపారు. స్థానిక వైద్యశాలలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరదలు, తుపానులు, పిడుగు పాటు, పాముకాటు, అడవి జంతువుల దాడి, అగ్ని ప్రమాదాలు, రోడ్డు, రైలు ప్రమాదాలు, జబ్బు చేసి పశువులు మృతి చెందిన సందర్భంలో వైఎస్సార్ పశు బీమా వర్తిస్తుందని వెల్లడించారు. ఒక కుటుంబానికి ఐదు పశువుల వరకు బీమా వర్తిస్తుందని తెలిపారు. గొర్రెలు, మేకలు, పందులకు సంబంధించి సంవత్సరానికి 50 పశువులకు బీమా చేయించుకోవచ్చని వివరించారు. వైఎస్ఆర్ బీమా పథకానికి సంబంధించి పూర్తి వివరాలకు టోల్ ఫ్రీ నంబరు 1962 సంప్ర దించవచ్చని వివరించారు. బీమా చేయించిన పశువును విక్రయిస్తే ఏడు రోజులలోపే బీమా కంపెనీ వారికి సమాచారం తెలియజేసి పేరు నమోదు చేయించుకోవాలని చెప్పారు.



మండల పశు వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్